రైతుల ఖాతాల్లో రూ. 29.57కోట్లు జమ

ప్రజాశక్తి - కలెక్టరేట్

పిఎం కిసాన్ - రైతు భరోసా మూడో విడత నిధులు విడుదల మంగళ వారం రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో స్థానిక గిరి మిత్ర సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ పాల్గొన్నారు. జిల్లాలో 1,39,505 మంది రైతులకు రూ.29.57 కోట్లు జమ కానుందని ఆయన పేర్కొన్నారు. 1,15,349 మంది రైతులకు రూ.23.46 కోట్లు, 2,572 మంది కౌలుదారులకు రూ.72 లక్షలు, 19,658 మంది అటవీ పట్టాలు పొందిన గిరిజన రైతులకు రూ.3.95 కోట్లు, కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులు 1926 మందికి రూ.1.45 కోట్లు జమ అవుతుందని ఆయన చెప్పారు.

పేదల భూములకు రక్షణ కల్పించాలి

- భూసర్వే నమోదు ప్రక్రియ మరింత సరళతరం
- సిసిఎల్ఎ కమిషనర్ సాయిప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం

పేదల జోలికి వెళ్లొద్దని, వారు సాగుచేసుకుంటున్న భూములకు రక్షణ కల్పించాలని అధికారులను, ఆంధ్రప్రదేశ్ భూపరిపాలన చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. భూ కబ్జాలకు పాల్పడే మోతుబరులపై కఠిన చర్యలను తీసుకోవాలని సూచించారు. పేదలకు వ్యతిరేకంగా పనిచేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం క్రింద చేపట్టిన సమగ్ర భూ సర్వేపై, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వే, భూరికార్డుల కమిషనర్ సిద్దార్థజైన్ తో కలిసి, సిసిఎల్ఎ సాయిప్రసాద్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా మూడు జిల్లాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియ వివరాలను కలెక్టర్లద్వారా తెలుసుకున్నారు. భూ సర్వే ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించడంతోపాటు, వివరాలను మరింత సరళంగా నమోదు చేసే ప్రక్రియపై వివిధ స్థాయి అధికారులు, సిబ్బంది అభిప్రాయాలను తెలుసుకున్నారు. నమోదు చేసే సమయంలో వారికి ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ మాట్లాడుతూ విఆర్ఒ లాగిన్‌లోని అంశాలను 38 నుంచి 20కి తగ్గిస్తామని చెప్పారు. భూముల కేటగిరీకి సంబంధించి అగ్రికల్చర్, హార్టికల్చర్ లేదా నాన్ అగ్రికల్చర్ విభాగాలను మాత్రమే ఉంచుతామని తెలిపారు. నీటి వనరులకు సంబంధించి మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ఆప్షన్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతుల వ్యక్తిగత వివరాలను నమోదు చేసే ప్రక్రియను కూడా మరింత సరళంగా చేస్తామన్నారు. ఎక్కడ ప్రభుత్వ భూమి ఉన్నా 22 ఎలో నమోదు చేయాలని ఆదేశించారు. అసైన్డ్ భూమి కొన్నవారికి పిఒటి ప్రకారం నోటీసు ఇచ్చి, దానిని ప్రభుత్వ భూమిగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములను సాగు చేసుంటున్న నిరుపేదల జోలికి వెళ్లొద్దని సిసిఎల్ఎ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్, మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జెసి ఒ.ఆనంద్, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, మూడు జిల్లాల సర్వేశాఖ ఎడిలు, తహాశీల్దార్లు, డిటిలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిసిఎల్ఎ కమిషనర్ సాయిప్రసాద్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని డిఆర్ఒ జె.వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో పోలింగ్, సెక్టార్ అధికారులతో ఎన్నికల ప్రక్రియ, విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అవగాహనా తరగతులు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికలు సజావుగా, పగడ్బందీగా జరిగేందుకు పోలింగ్ అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈనెల 12న కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ అధికారులు సామాగ్రిని సరిచూసుకొని రూట్ అధికారులతో నియమించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మౌలిక సదుపాయాలు, వెబ్ కాస్టింగ్‌కు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పిఒల అనుమతిలేనిదే ఎవర్నీ అనుమతించరాదని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పోలింగ్ ముందురోజు సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు సమర్పించే ఫారం -10 ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థి సంతకం, గుర్తింపు కార్డును పరిశీలించాలన్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాల బయట ఓటర్ల అవగాహనకు పోటీలో నిలిచిన అభ్యర్థుల పేర్లు, చిహ్నాలను బయట గోడకు అతికించాలని చెప్పారు. ఓటరు ఓటు హక్కును గోప్యతగా వినియోగించుకొనేలా విధులు నిర్వహించాలని అన్నారు. ఓటరు స్లిప్‌లు పోలింగ్ కేంద్రం సూచిక మాత్రమేనని, ఎన్నికల కమిషన్ అనుమతించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా ఓటరు చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికలు ఈనెల 13న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందని, ఎన్నికల నిర్వహణకు ఉదయం గంట7 లకు పోలింగ్ అధికారులు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. పోలింగ్ సమయం ముగిసే సరికి క్యూలైన్‌లో ఉన్నవారికి మాత్రమే అనుమతించి స్లిప్‌లు జారీచేయాలని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లకు, ఇతరులకు మొబైల్‌ఫోన్లు, కెమెరాలు వంటివి అనుమతి లేదని వెల్లడించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ తర్వాత బ్యాలెట్ బాక్స్ సీల్ చేసి, భద్రపరచే విధానాన్ని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల రిసోర్స్‌పర్సన్లు పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పార్వతీపురం ఆర్డీవో కె.హేమ లత, పోలింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ జె.వెంకటరావు

చింతపండు ప్యాకెట్లను పరిశీలిస్తున్న జిసిసి డిఎం మహేంద్రకుమార్

రైతు బజార్లో జిసిసి చింతపండు విక్రయాలు

ఎంఎఫ్ పి గోదాం పరిశీలించిన డిఎం

ప్రజాశక్తి - సాలూరు

రైతు బజార్‌ల్లో, రిటైల్ మార్కెట్ షాపుల్లో చింతపండు విక్రయాలు ప్రారంభించినట్లు జిసిసి డిఎం వి.మహేంద్రకుమార్ చెప్పారు. మంగళవారం ఆయన పట్టణంలోని జిసిసి బ్రాంచి కార్యాలయం ఆవరణలో గల చిన్న తరహా అటవీ ఉత్పత్తుల గోదాంను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిసిసి కొనుగోలు చేసే చింతపండుకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కిలో రూ.32.40 అని చెప్పారు. గిరిజనులు నాణ్యమైన చింతపండు తీసుకురావాలని కోరారు. సేకరించిన చింతపండును తడి చేయొద్దని సూచించారు. రైతు బజార్‌ల్లో జిసిసి విక్రయాలకు సంస్థ నిర్ణయించిందని చెప్పారు. ఇటీవల విశాఖలో ఎమ్ డి సురేష్ కుమార్ ప్రారంభించారని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న రైతు బజార్‌ల్లోనూ విక్రయాలు ప్రారంభిస్తామని చెప్పారు. బ్రాంచి మేనేజర్ జె.రామారావు మాట్లాడుతూ గోదాంలో చింతపండు ప్యాకింగ్ చేసి విక్రయాలు చేపడుతున్నట్లు తెలిపారు. మూడు కిలోల ప్యాకెట్ రూ.130గా నిర్ణయించినట్లు చెప్పారు. సంచార వాహనాల ద్వారా కూడా చింతపండు విక్రయాలు ప్రారంభిస్తామని తెలిపారు.

కొత్తవలస పాఠశాల పరిశీలించిన డిఎం

మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను జిసిసి డిఎం మహేంద్రకుమార్, మేనేజర్ రామారావు పరిశీలించారు. వసతిగృహానికి నాణ్యమైన సరుకులు సరఫరా అవుతున్నదా లేదా అని పాఠశాల హెచ్ఎం సంధ్యారాణిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా లోపాలుంటే ఫిర్యాదు చేయాలని కోరారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను వారు పరిశీలించారు. విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టులను పరిశీలించారు.

చట్టసభల్లో ప్రజల గొంతు వినిపిస్తా..

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల, పెన్షనర్ల సమస్యలను, బాధలను నేడు వినేవారే కరువయ్యారని, ఇలాంటి పరిస్థితుల్లో చట్ట సభల్లో అందరి గొంతుగా మన వాణి వినిపించాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. చట్ట సభల్లో ప్రశ్నించి, డిమాండ్లను సాధించుకునేందుకు పిడిఎఫ్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నగరంలోని విజ్జీ స్టేడియం, రాజీవ్‌గాంధీ స్టేడియంలో వాకర్స్‌ను, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న నిరుద్యోగులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రుల ఓటర్లను కలుస్తూ, నిరుద్యోగ యువతతో ర్యాలీ అవుతూ సమస్యలు తెలుసుకుని కాసేపు ముచ్చటించారు. అందర్నీ పలకరిస్తూ మద్దతు తెలపాలని కోరారు. నేడు ఉద్యోగుల సమస్యలు సిపిఎస్ రద్దు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యమని అన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను మభ్య పెట్టారని అన్నారు. ప్రచారంలో యువత, ఉద్యోగుల నుంచి విశేష ఆదరణ లభించింది. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సురేష్, వెంకటేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికే మొదటి ప్రాధాన్యత ఓటు

పార్వతీపురంటౌన్ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకే మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. మంగళవారం పార్వతీపురం పట్టణంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, స్కీం వర్కర్లతో సిఐటియు జిల్లా నాయకులు గొర్లె వెంకటరమణ కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ ప్రజా సేవకు అంకితమై పని చేస్తున్నారని, నీతివంతమైన రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ వేదికగా పనిచేస్తున్నారని అన్నారు. చట్టసభ లోపల, వెలుపల ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలబడుతున్నారని, కావున పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

పార్వతీపురంలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విస్తృతంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం

కలెక్టరేట్‌లో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండలంలోని వెలగవాడలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జెవివి జిల్లా కార్యదర్శి ,ఎస్ .ఉమా మహేష్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల తదితర రంగాల సమస్యలు పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థిని గెలిపించాలని, గ్రాడ్యుయేషన్ ఓటర్లకు మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేసి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు సిఐటియు నాయకులు కాద రాము దూసి దుర్గారావు తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు భద్రత ఏదీ?

గజపతినగరం : ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని రమాప్రభ అన్నారు. గజపతినగరంలో ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పర్యటించి అధ్యాపకులను, యాజమాన్యాలను కలుసుకున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, సంక్షేమబోర్డు, సహాయ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటినీ నెరవేర్చుకోవాలంటే అందరి గొంతును శాసనమండలిలో వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థినైన తనను గెలిపించాలని కోరారు. ఆమె వెంట ప్రజా సంఘాలు నాయకులు జి. శ్రీనివాస్, వి.లక్ష్మి, డి.రాము, ఎస్.బంగారునాయుడు, ఎన్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

6లోగా లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ (సి.ఎల్.ఐ.ఎస్.సి) పరీక్షలకు మార్చి 6లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఎల్ఐఎస్‌సి రెగ్యులర్, ఫెయిల్ అయిన అభ్యర్థులు అపరాధ రుసుం లేకుండా సంబంధిత ఇనిస్టిట్యూట్‌లో మార్చి 6 వరకు ఫీజు చెల్లించాలని ఆయన చెప్పారు. రూ.60 అపరాధ రుసుంతో మార్చి 9 వరకు చెల్లించ వచ్చని తెలిపారు. సంబంధిత సంస్థలు సిఎఫ్‌ఎంఎస్‌లో మార్చి 7 నాటికి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని చెప్పారు. రూ.60 అపరాధ రుసుంతో మార్చి 11 నాటికి ఫీజు చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తులు మార్చి 1 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. రెగ్యులర్, ప్రైవేట్ అభ్యర్థులు రూ.150 ఫీజు, 3 పేపర్ల వరకు రూ.100, 3 పేపర్లు కంటే ఎక్కువ ఉంటే రూ.150 ఫీజు చెల్లించాలన్నారు. పరీక్ష రుసుం, నామినల్ దరఖాస్తు ఫారాలను డిజిఇ కార్యాలయంలో మార్చి 15 నాటికి సమర్పించాలని ఆయన వివరించారు. మార్చి 1 నుండి ఆన్లైన్లో దరఖాస్తు అందుబాటులో ఉండునని ఆయన తెలిపారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో ఉన్న మెలియాపుట్టి, భామిని మండలాల్లో గల ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు ఆఫీసర్ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,9 తరగతుల్లో చేరేందుకు బ్యాక్ లాగ్ సీట్లుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. aptwgurukulam.ap.gov.in ఈ వెబ్ సైట్కు దరఖాస్తు ఆన్లైన్లో చేసుకోవాలని తెలిపారు. ఆఖరి తేదీ 15-4-2023 పరీక్ష నిర్వహించే తేదీ 30-4-2023న సీతంపేట బాలికల గురుకుల పాఠశాల, పెద్దమడి బాలురు పాఠశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పొదుపు సంఘాల సొమ్ము రూ.18లక్షలు స్వాహా?

- ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో అక్రమాలు
- గోప్యంగా ఉంచుతున్న ఎస్‌బిఐ అధికారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ పక్కనున్న ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సీతానగరం మండలానికి చెందిన జానుమల్లువలస, గాదెలవలస, తదితర గ్రామాల పొదుపు సంఘాలకు చెందిన డబ్బులు రూ.18లక్షలు వరకు కేంద్రం నిర్వాహకులు స్వాహా చేసినట్లు తెలిసింది. పొదుపు సంఘాలన్నీ బొబ్బిలి ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచిలో పొదుపు డబ్బులు కడతారు. వీరు డబ్బులు కట్టేందుకు మెయిన్ బ్రాంచికి వెళితే పక్కన ఉన్న ఖాతాదారుల సేవా కేంద్రంలో కట్టాలని బ్యాంకు అధికారులు సూచిస్తుంటారు. దీంతో మూడు నెలల నుంచి పొదుపు సంఘాల సభ్యులు కడుతున్న రుణాలు, పొదుపు సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా నిర్వాహకులు ఉంచేసుకుని స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకునిపై పొదుపు సంఘాల సభ్యులు బ్యాంకు అధికారులకు ఈమేరకు ఫిర్యాదు చేశారు.

రూ.18లక్షలు స్వాహా?

పొదుపు సంఘాల రుణాలు, పొదుపు సొమ్ము రూ.18లక్షలు వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారు కట్టిన డబ్బులు సంఘాల ఖాతాలో జమ కాకపోవడంతో సభ్యులు బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.అయితే ఖాతాదారుల సొమ్మును సేవా కేంద్రం నిర్వాహకులు స్వాహా చేసిన విషయాన్ని బ్యాంకు అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. గతంలో ఇదే ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకులు సీతానగరం మండలం అంటిపేటలో సేవా కేంద్రాన్ని నడిపి అక్రమాలకు పాల్పడడంతో అక్కడ సేవా కేంద్రాన్ని ఎత్తి వేశారు. ఆ తరువాత బొబ్బిలి స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ పక్కన గత కొన్నేళ్లుగా ఖాతాదారుల సేవా కేంద్రాన్ని నడుపుతున్నారు.

ఎన్‌వైకె ఆధ్వర్యాన యూత్ పార్లమెంట్

ప్రజాశక్తి - సాలూరు

నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ విజయనగరం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాధాకృష్ణ, స్థానిక మున్సిపల్ కమిషనర్ హనుమంతు శంకరరావు వివేకనందుని చిత్ర పటానికి పూలమాల వేసి, జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య మాట్లాడుతూ జి-20 సమావేశానికి భారతదేశం ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ శంకరరావు మాట్లాడుతూ ఆధునికీకరణ పేరుతో పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టడంలేదన్నారు. ప్రకృతికి దగ్గరగా జీవించాలని సూచించారు. రస్తకుంటుబాయి కృషి విజ్ఞన కేంద్రం వ్యవసాయ పరిశోధనా స్టేషన్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ టిఎస్ఎస్‌కె పాత్రో మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని పేర్కొన్నారు. చిరు ధాన్యాల వినియోగం ద్వారా ఆరోగ్యం బాగుంటుందన్నారు. యువత చిరుధాన్యాల వాడకంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువ సంవాద్ కార్యక్రమంలో భాగంగా హేమంత్, శివాని మొదలైన యువత గ్లోబల్ పాలసీపై జి-20 సభ్య దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారతదేశం పాత్ర అమోఘమని ప్రిన్సిపల్ రాధకృష్ణ తెలిపారు. వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంఎం శ్రీనివాస్, డాక్టర్ అబ్దుల్ సలాం మాట్లాడుతూ చిరు ధాన్యాలకు ప్రాచుర్యం పెంచడం ముందంజలో ఉండడం భారత్‌కు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల ప్రాముఖ్యత, చిరు ధాన్యాలు విస్తీర్ణం తగ్గడానికి కారణాలు, చిరు ధాన్యాల సాగు విధానం, వాటి ఉపయోగాలు, పోషకాలు, విలువ జోడింపు వివరించారు. కార్యక్రమంలో సాలూరు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.వి.శ్రీనివాసా మూర్తి, నాక్ సమన్వయ కర్త ఎటిఎస్ నాయుడు, ఎన్‌వైకె ఎఓవి పృధ్వీ, ఎన్ఎస్ఎస్ అధికారి, ఎన్‌వైకె వాలంటీర్లు శ్రావణ్, నాయుడు, సింహాచలం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను సన్మానిస్తున్న ఎన్‌వైకె అధికారి విక్రమాదిత్య, ప్రిన్సిపల్ రాధాకృష్ణ

మెగా క్రికెట్ టోర్నీ విజేత వీరఘట్టం జట్టు

ప్రజాశక్తి - కురుపాం

విద్యతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. స్థానిక సాయిరాం గుడి మైదానం వద్ద యువత డి.నవీన్, ఇమ్మానియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నీకి వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు ఆతిథ్యంలో 24 రోజులుగా 98 టీములు పోటీ పడగా చివరకు వీరఘట్టం- పార్వతీపురం మధ్య పోటీ పోటీగా మ్యాచ్ జరగ్గా చివరకు వీరఘట్టం జట్టు టోర్నీ విజేతగా నిలిచింది. వీరికి మంగళవారం బహుమతులు స్థానిక ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు విద్యలోనూ రాణించి ఉన్నత స్థాయి ఉండాలన్నారు. అనంతరం టోర్నీ విజేతగా నిలిచిన వీరఘట్టం జట్టుకు రూ.20వేలు నగదు బహుమతి షీల్డ్‌ను, రెండో స్థానంలో నిలిచిన పార్వతీపురం జట్టుకు రూ.10వేలు నగదు, షీల్డ్‌ను అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ చంద్రశేఖర్, వైసిపి నాయకులు, స్థానిక యువత పాల్గొన్నారు.

వీరఘట్టం జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఎస్ఎఫ్ఐకు ధీరా ఫౌండేషన్ లక్ష విరాళం

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విద్యార్థులకు, ప్రజలకు అనేక రకాలుగా సేవలందిస్తున్న ఎస్ఎఫ్ఐకు ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా ధీర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొత్స సందీప్ విద్యార్థుల భవిష్యత్తు కోసం లక్ష రూపాయల విరాళాన్ని మంగళవారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నామని, నిరుద్యోగులకు వృత్తి విద్య శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ ఇప్పించి వారిని ఆదుకుంటామని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమైన వారికి కోచింగ్ సెంటర్ల ద్వారా నాణ్యమైన కోచింగ్ అందించి వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా క్యాదర్శి పి.రామ్మోహన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిఎల్‌జె నాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు సోమేశ్వరరావు, ధీర ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టుపై నేటి నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో మార్చి 1 నుంచి 21వరకు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు తెలిపారు. పట్టణ ప్రాంతాలైన విజయనగరం, నెల్లిమర్ల, బొబ్బిలి మరియు రాజాంలో 18 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశించిన ఫలితాలు వెలువడనందున, కలెక్టర్ ఆదేవాల మేరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధాకుమారి

మొక్కుబడిగా నగర పంచాయతీ సమావేశం

పాలకొండ రూరల్: ప్రతినెలా ప్రజా సమస్యలపై జరిగే నగర పంచాయతీ సాధారణ సమావేశం మంగళవారం మొక్కుబడిగా జరిగింది. నగర పంచాయతీ సమావేశానికి చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావుతో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు హాజరై మమ అనిపించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రజాప్రతినిధులే సమావేశానికి హాజరుకాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నగర పంచాయతీలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించడానికి ఇదొక వేదికగా చెప్పవచ్చు. అటువంటి ప్రాధాన్యత కలిగిన సమావేశానికి కౌన్సిలర్లు దుమ్మా కొట్టడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

కుల దూషణపై దర్యాప్తు

పాచిపెంట : మండలంలోని కూనం బందవలసకు చెందిన గిరిజన రైతు చెల్లారి సామయ్య ఇచ్చి కుల దూషణ ఫిర్యాదు మేరకు మంగళవారం డిఎస్‌పి ఎ.సుభాష్ దర్యాప్తు నిర్వహించారు. చెల్లారి సామయ్య సాగు చేసి పండించిన మొక్కజొన్న పంటను కొత్తవలసకు చెందిన బొంగు పైడినాయుడు, మరో 11మంది సామయ్య మొక్కజొన్న పంటను పూర్తిగా ధ్వంసం చేసి తన పొలంలో ఉన్న వ్యవసాయ మోటార్లు పట్టుకుపోయారు. దీనిపై సామయ్య ఎందుకిలా చేశారని ప్రశ్నించగా వారంతా కులం పేరుతో దూషించి నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ బెదిరించడంతో సామయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డిఎస్‌పితోపాటు కొటియా సిఐ రోహిణీపతి, రెవెన్యూ అధికారులు సామయ్య పొలం వద్దకు వెళ్లి దర్యాప్తు చేశారు.

వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తోటపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

కురుపాం : తోటపల్లి దేవస్థాన అభివృద్ధి సేవ ట్రస్ట్ సహకారంతో జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం తోటపల్లిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి 350 మంది వైద్య సేవలు వినియోగించుకోగా, 35 మందికి ప్రత్యేక వైద్యం కోసం బస్సును ఏర్పాటు చేసి బుధవారం రాగోలు జేమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లి వారికి ఉచిత భోజన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం అభివృద్ధి సంస్థ సభ్యులు, జేమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డప్పులతో అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఘనంగా సంతోషి మాత యాత్ర మహోత్సవాలు

భామిని : మండలంలోని బత్తిలిలో ఐదురోజులు పాటు నిర్వహించే 37వ వార్షిక మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ యాత్ర మహోత్సవంలో భాగంగా సంతోషిమాత విగ్రహాన్ని బత్తిలి పురవీధుల్లో డప్పు, వాయిద్యాలతో మంగళవారం ఊరేగించారు. ఈ యాత్ర మహోత్సవాల్లో భాగంగా 5 రోజులు సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన పూజారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఐదు రోజుల పాటు ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని సంతోషిమాత ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్వయంశక్తితో ఎదగాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మహిళలు స్వయంశక్తితో ఎదిగేందుకు ముందుకు రావాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. టైలర్స్‌డేను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో కొత్తవలసలో కొత్తగా ఏర్పాటు చేసిన నవదుర్గ బోటిక్ లేడీస్ టైలర్ షాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బెలగాంలో గల వైసిపి కేంద్ర కార్యాలయంలో సత్య టైలరింగ్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి అందరికీ టైలర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దర్జీ వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందుతున్న మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. దర్జీ వృత్తి ద్వారా ఉపాధి పొందుతున్న ప్రతి ఒక్కరికీ జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10వేలు ఆర్థికసాయం గత మూడేళ్ళుగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఎఎంసి వైస్ చైర్మన్ వి.శంకర్రావు, స్టేట్ డైరెక్టర్లు శ్రీదేవి, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

టైలర్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఆర్‌టిఒ మల్లికార్జున రెడ్డి

వాహనదారులకు అపరాధ రుసుం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రహదారి భద్రతను పాటించని వాహనదారులకు జిల్లా రవాణా శాఖ అధికారులు అపరాధ రుసుంలు విధించారు. జిల్లా రవాణా శాఖ అధికారి సి.మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో కలిసి మంగళవారం పట్టణంలోని బెలగాం శివారు ప్రాంతంలో పలు వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన ఆటోలను, వాహన పత్రాలు లేని, హై సెక్యూరిటీ ప్లేట్లు లేని, ఎక్కువ శబ్దంతో తిరిగే వాహనాలను, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే వారిని గుర్తించి, ఆయా యజమానులకు అపరాధ రుసుంలు విధించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులతో ఆయన మాట్లాడుతూ, వాహనదారులంతా సురక్షిత ప్రయాణం కోసం భద్రతా ప్రమాణాలు, సురక్షిత ప్రయాణం కొరకు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను పాటించాలని సూచించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

వీరఘట్టం : స్థానిక పాత బస్టాండులో మంగళవారం ఎస్పై ఎం.హరికృష్ణ ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పై మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని, నిదానమే ప్రధానమని క్షేమంగా గమ్యానికి చేరుకోవాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

సాలూరు : పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ పట్టణ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి జె.సీతారాం సోమవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని వందమంది వికలాంగులకు గుర్తింపు కార్డులు, త్రిచక్ర వాహనాలు మంజూరు చేయాలని కోరారు. రైల్వే స్టేషన్‌రోడ్‌లో గల మున్సిపల్ రిజర్వాయర్‌కు మెట్లు నిర్మించి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. పట్టణంలో ఎఆర్టీ మందులు వాడుతున్న 30మంది ఎయిడ్స్ రోగులకు ఎఎవై కార్డులు మంజూరు చేయాలన్నారు.

వృద్ధులకు నేత్ర పరీక్షలు

కురుపాం : వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని బియ్యాలవలస సచివాలయం పరిధిలో గల గ్రామాల్లో 60ఏళ్లు పైబడి గల వృద్ధులకు మంగళవారం నియోజకవర్గ నేత్ర వైద్య అధికారి జి.నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో నేత్ర వైద్య సహాయకులు రమేష్ నేత్ర పరీక్షలు జరిపి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి మార్చి 10న పుష్పగిరి కంటి ఆసుపత్రికి శస్త్రచికిత్సలు కోసం తరలిస్తున్నామని తెలిపారు. వీరందరికీ ఉచిత భోజనం, రవాణా ఖర్చులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

పంపిణీకి ఓటరు స్లిప్‌లు సిద్ధం

ప్రజాశక్తి - వీరఘట్టం

త్వరలో జరగనున్న పిడిఎఫ్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పులను పంపిణీ చేసేందుకు మంగళవారం రెవెన్యూ సిబ్బందిని సిద్ధం చేస్తున్నారు. మండలంలోని 1319 మంది సభ్యులు ఓటు నమోదు చేసుకున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరికి త్వరలో బూత్ లెవెల్ అధికారుల ద్వారా పంపిణీ చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఇందు, సంతోష్, దుర్గారావు తదితరులు ఉన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

వీరఘట్టం : మండలంలోని రేగులపాడులో మంగళవారం 40మంది పాడి రైతులకు విశాఖ డెయిరీ సూపర్వైజర్ జి.మహాలక్ష్మి నాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే విశాఖ డెయిరీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో 12వేల మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిషన్ ఏజెంటు బి.ముకుందరావు, గ్రూప్ లీడర్ వారాడ పోలమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరంలో జరుగుతున్న చానల్ పనులను ఎంపిడిఒ డొంక త్రినాధులు మంగళవారం తనిఖీ చేశారు. క్షేత్ర సహాయకులు కేవలం ఆరుగురు వేతనదారులతో పని చేయిస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

కుటుంబానికి ఆసరా వైఎస్ఆర్ బీమా

ప్రజాశక్తి - భామిని

మండలంలోని ఘనసర పంచాయతీ ఇప్పమానుగూడకు చెందిన ఆరిక సాయమ్మ తీవ్ర జ్వరంతో మృతి చెందింది. ఈమెకు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు మృతిని భర్త బిడ్డిక రెమకకు మంగళవారం ఘనసర సర్పంచ్ ప్రతినిధి కిల్లారి పాల్గుణరావు అందజేశారు. మిగిలిన బీమా సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఆపదలో వై స్ఆర్ బీమా కుటుంబానికి ఆసరా నిలుస్తుందని సర్పంచ్ ప్రతినిధి అన్నారు. కార్యక్రమం వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్, మోజెస్ వున్నారు.

2న సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ఈనెల 2న పార్వతీపురం మండల అభివృద్ధి కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు ఎపిఒ శివరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో భాగంగా 16వ విడత సామాజిక తనిఖీలు, నివేదిక నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున క్షేత్ర సహాయకులు వారి పంచాయతీకి సంబంధించి పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

పాఠశాలకు సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం అన్ని పాఠశాలలకు సామాగ్రిని ఎంఇఒ పి.కృష్ణమూర్తి పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు మరుగుదొడ్లు, లిక్విడ్లతో పాటు ఫైర్ యంత్రాలు కూడా పంపిణీ చేశారు.

ఘనంగా విద్యార్థులకు వీడ్కోలు

పార్వతీపురంరూరల్ : మండలంలోని డోకిశిల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు ఉత్సవం వేడుకగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధానోపా ధ్యాయులు గోవిందరావు మాట్లాడుతూ టెన్త్ తర్వాత విద్యార్థుల జీవితం కీలకమైన దశకు చేరుకుంట ారని, కావున టెన్త్ పరీక్షల్లో మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించగలిగితే మంచి భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుందని అన్నారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు ఎంతగానో అకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిఇటి మంతిన వాసుదేవరావు, ఉపాధ్యాయులు రమేష్, అప్పారావు గౌరీశంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి

పాలకొండ: : తెలంగాణలోని కాకతీయ మెడికల్ కాలేజీలో జరిగిన అమానవీయ బలవంతపు మరణ కారణానికి గురైన గిరిజన మెడికల్ విద్యార్థిని ప్రీతి మరణానికి కారుకులైన వారిని వెంటనే శిక్షించాలని ఆలిండియా దళిత రైట్స్ ఫొరం జిల్లా అధ్యక్షులు బత్తిని మోహన ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆడపిల్లలకు రక్షణ లేదని, ప్రత్యేక చట్టాలు ఉన్న ప్రభుత్వ చర్యలు శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

సంతలో చింతపండు కొనుగోళ్లను పరిశీలిస్తున్న జిసిసి మేనేజర్ కృష్ణప్రసాద్

వారపు సంతలో చింతపండు కొనుగోలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి వారపు సంతలో చింతపండును జిసిసి ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని మేనేజర్ వి.కృష్ణప్రసాదరావు తెలిపారు. మండలంలో తాడికొండ గిరిజన గ్రామంలో మంగళవారం జరిగిన వారపు సంతలో జిసిసి ఆధ్వర్యంలో చింతపండు కొనుగోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ చింత పండు రూ.32.40పైసలకు కొనుగోలు చేస్తామని, కావున గిరిజనులంతా కూడా చింతపండును వారి దగ్గరలో ఉన్న వారపు సంతకు తీసుకొచ్చి జిసిసికి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్ ఎన్.గణపతిరావు, గోదాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు, సర్పంచ్ ఎం.జగ్గారావు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.రాధికా, సేల్స్‌మేన్ భాస్కరరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సాలూరు : పట్టణ పరిధిలో జీగిరాం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా సింగిగూడకు చెందిన డి.జగన్నాథం (30)గా గుర్తించారు. బైకుపై స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొందని టౌన్ ఎస్ఐ పాపారావు చెప్పారు. ఈ ప్రమాదంలో జగన్నాథం తలకు బలమైన గాయమవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత కక్షతో మహిళపై దాడి

పార్వతీపురంరూరల్ : సీతానగరం మండలం సుమిత్రాపురం గ్రామానికి చెందిన గేదెల సూరమ్మపై అదే గ్రామంలో ఆమె పక్కఇంట్లోనే నివసిస్తున్న చిన్నిక్రిష్ణ అనేవ్యక్తి పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం ఉదయం ఇంట్లో ఆమె కొడుకు లేనప్పుడు కర్రతో దాడిచేసి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

దొంగ దొరికాడు

విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

పాలకొండ : పట్టణంలోని ముదునూరు వారివీధిలో ఈ నెల 21న వడ్డీ కమల అనే మహిళ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును గుర్తుతెలి యని వ్యక్తి వచ్చి అపహరించిన కేసును పోలీసులు దర్యాప్తు చేసి మంగళవారం చేధించారు. ఈ మేరకు వివరాలను విలేకరులకు డిఎస్‌పి జి.వి.కృష్ణారావు, సిఐ కె.మురళీధర్, ఎస్ఐ శివప్రసాద్ అందించారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు సూచనల మేరకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఐదు టీంలుగా ఏర్పాటై పట్టణంలోని సిసి కెమేరాలను లోతుగా పరిశీలించారు. దొంగతనం జరిగిన ప్రదేశం నుంచి పాలకొండలో ఉన్న పలు ప్రాంతాల్లో సిసి కెమేరాలను పరిశీలించారు. అయితే ఏలాం జంక్షన్ వరకు ఒక వ్యక్తి వెళ్లి తిరిగి అక్కడ నుంచి సీతంపేట రోడ్డువైపుగా వెళ్లకపోవడాన్ని సిసి కెమెరా ద్వారా తెలుసుకున్నారు. దీంతో మధ్యలో ఉన్న ఎన్‌కె రాజపురంలో నిఘాపెట్టి ఆరా తీశారు. మెంతి మణికంఠ అనే వ్యక్తి దొంగతనం చేసినట్టు గుర్తించారు. పదేళ్ల క్రితం చెన్నై వెళ్లిపోయి షాపులో పనిచేసుకుంటూ ఇటీవలే సంక్రాంతికి వచ్చి ఇక్కడ ఉండిపోయాడు. మంగళవారం మణికంఠను ఏలాం జంక్షన్‌లో పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు.

అభివృద్ధికి శాస్త్ర విజ్ఞానం దోహదం

పార్వతీపురం : ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డిఇఒ రమణ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెందడం ఆహ్వానించదగ్గ పరిణామమని, దీనివల్ల పర్యావరణానికి ఏమాత్రం ముప్పువాటిల్ల కూడదని జిల్లా విద్యాధికారి ఎస్‌విడి రమణ అన్నారు. సర్ సివిరామన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జరిగిన సైన్స్‌డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్సిపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనను ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడుతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సైన్ అభివృద్ధి చెంది, పలు ఉపకరణాలు అందుబాటులోకి రావడం వల్ల మానజీవితం సుఖవంతమైందని, అయితే శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెంది, పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తుందని, దీనివల్ల పర్యావరణానికి తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందని, భవిష్యత్తులో జరిగే ఏ ప్రయోగాలైనా వాతావరణ పరిస్థితులకు హానికలిగించని విధంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్ల బాలకృష్ణ, ఎస్.మురళీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్ర ఫలాలు అందరికీ అందాలి

విజ్ఞాన శాస్త్ర ఫలాలు సామాన్యులందరికీ అందాలని జెవివి జాతీయ నాయకులు డాక్టర్ ఎంవిఆర్ కష్ణాజీ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం, వైకెఎం కాలనీలోని లక్ష్మీ స్కూల్ ఆఫ్ నర్సింగ్, కళాశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణాజీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మారు మూల గిరిజన ప్రాంతాలకు సైన్స్ ఫలాలు అందేలా ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు కషి చేయాలని కోరారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఆర్.రత్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇఇ కెఎల్ పద్మకళ, డిఎఒ అల్లు ధనలక్ష్మి, జెవివి జిల్లా కార్యదర్శి డి.చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, కళాశాల నిర్వాహకులు శంకర్ రావు, మహిళా విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : ప్రతి ఒక్క విద్యార్థి ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సైన్స్ దినోత్సవ వేడుకలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ప్రయోగాత్మకమైన పరిజ్ఞానం అవసరమని అన్నారు. కావున అటువంటి పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని సూచించారు. మండలంలో గల అన్ని పాఠశాలల్లో సైన్స్ డేను విద్యార్థులు పలు రకాల ప్రయోగాత్మకమైనవి తయారు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: విద్యార్థులంంవ శాస్త్రవేత్తలేనని, నిత్య జీవితం సైన్సుతో ముడిపడి ఉందని నగర పంచాయతీ పరిధిలోని వెంకంపేట ఎంపీయూపీ పాఠశాల హెచ్ ఎం జి.పరాంకుశంనాయుడు అన్నారు. పాఠశాలలో జాతీయ సైన్సుడేను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాలు అర్పించారు. సైన్సు ఉపాధ్యాయులు నాగమణి, గోపీ సైన్సు ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులలో సజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు చూపరులను ఆకర్షించాయి.

జియ్యమ్మవలస : మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులు వర్కింగ్ మోడల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల రూపొందించిన సోలార్ వాటర్ ప్యూరిఫైయర్, లావా ఎక్స్‌ప్లోజర్, నీటి నుంచి విద్యుత్ తయారీ, ట్రాఫిక్ హెయిర్ కంట్రోల్ మెకానిజం వంటి పలు ప్రాజెక్టులు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్.తిరుపతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డ్రాయింగ్

సైన్స్‌డే సభలో డిఇఒ

జియ్యమ్మవలస : సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయులు రుగడ శ్రీనివాసరావు సైన్స్ దినోత్సవ సందర్భంగా వేసిన సివి రామన్ చిత్రపటం విద్యార్థులను ఆకట్టుకున్నారు. డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతుల్ని అందించారు. వివిధ ప్రాజెక్టులకు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్ సాంబమూర్తి పాల్గొన్నారు.

శ్రీసత్య కైలాస్ పాఠశాలలో

మండలంలోని పెదమేరంగి శ్రీసత్య కైలాస్ పాఠశాలలో విద్యార్థులు రకరకాల ప్రాజెక్టులను తయారు చేశారు. వీటిలో సేంద్రియ వ్యవసాయ విధానం నుంచి పంట మార్పిడి విధానం, సాటిలైట్స్ వంటివిషయాలు విద్యార్థులు చక్కగా ప్రయోగాత్మకంగా సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన రౌతు వాసుదేవరావు, పాఠశాల కరస్పాండెంట్ రౌతు అజయ్ కుమార్, హెచ్ఎం పి.రాజశేఖర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులను శాస్త్రీయ అవగాహన పెంచుకొని ఉన్నత స్థానాలకు ఎదిగి మంచి శాస్త్రవేత్తలు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ప్రభాకర్, సాయికృష్ణ, సావిత్రి, కవిత, పడాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతని వెలికి తీయడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ఎంఇఒ రాజ్ కుమార్ చెప్పారు. స్థానిక లయన్స్ క్లబ్ హైస్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రాజెక్ట లను ఆయన పరిశీలించారు. ప్రాజెక్టులు ఏర్పాటు చేసిన విద్యార్థులను అభినందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కె.వెంకటరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.గణేశ్వరరావు, హెచ్ఎం భాస్కరరావు , ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సాలూరురూరల్ : మండలం లోని మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు చేపట్టారు. సైన్స్ ఉపాధ్యాయులు ప్రకాశం, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ ఆధ్వర్యంలో సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులు ఐ.దిలీప్‌కుమార్, ఎం.జానకీరావు, వై.సంతోషి ఆధ్వర్యంలో విద్యార్థుల వైజ్ఞానిక సంబందించిన వివిధ మోడల్స్ ప్రదర్శించి, వాటిపై వివరణ ఇచ్చారు. కార్యక్రమం బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు ప్రాజెక్టుల ప్రదర్శన జరిగింది. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇటువంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టడమేకాకుండా, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి దోహదపడతాయని పాఠశాల

భామిని : సైన్స్‌డే నమూనాలో కూర్చొన్న విద్యార్థులు

హెచ్ఎం మరడాన శివున్నాయుడు అన్నారు. కార్యక్రమానికి గైడు టీచర్లుగా సైన్సు ఉపాధ్యాయులు జి.భారతి, జి.చూడామణి, రేవల్ల సతీష్‌రాజా, ఎస్.బోస్, స్కూల్ కమిటీ చైర్మన్ వెన్నెల తిరుపతిరావు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని పలుచోట్ల జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్ డే ఘనంగా మంగళవారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తుమరాడలోని శ్రీ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, పెదపెంకి జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్‌ప్రాజెక్టులను ప్రదర్శించారు. సివి రామన్ ప్రయోగాల విషయంలో చేసిన గొప్పతనాన్ని ఉపాధ్యాయుడు పి శ్రీనివాసరావు వివరించారు. సుమారు 25 సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేశారు. కార్యక్రమంలో బలిజిపేట జెడ్‌పి హైస్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.రాజేశ్వరరావు, శ్రీ భారతి విద్యాసంస్థల ప్రధాన ఉపాధ్యాయులు జగన్మోహనరావు, పెదపెంకి హెచ్ఎం రామారావు, సిబ్బంది అజయ్‌కుమార్, పైడిపునాయుడు, వెంకటరమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక డిగ్రీకళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ జి.జనార్ధన్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో అన్ని విభాగాల ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సైన్స్ దినోత్సవం జరపడం వల్ల పిల్లల్లో సైన్స్‌పట్ల అవగాహన కలుగుతుందన్నారు.

రవీంద్రభారతి పాఠశాలలో....

స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా సైన్స్‌ఎక్స్‌ఫో నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.శ్యామసుందరరావు, డీన్ ఎస్.నాగరాజు, డిఐ సిహెచ్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మక్కువ: జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా మండలంలోని వెంకట బైరి పురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎఎంఒ భానుమూర్తి హాజరై సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. విద్యార్థులు పలు సైన్స్ ప్రదర్శనలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరు : ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఇఒ

బలిజిపేట : ప్రాజెక్టులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం

కురుపాం : ప్రాజెక్టులను వివరించిన విద్యార్థులను అడుగుతున్న ఎంఇఒ